

# రాఖీ

ఆ రోజు శుక్రవారం.

ఉదయం పదకొండు గంటలయింది.

ఆఫీసులోకి కొత్తగా చేరిన అమీర్‌ని అందరికీ పరిచయం చేస్తున్నాడు ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ హెడ్డు. తెల్లని పైజామాపై తెల్లని షేర్వాణీ ధరించి చిరునవ్వులు చిందిస్తున్న ఆ సుపుర్షుడ్రూపిని అందరు రెప్ప వాల్చకుండా చూడసాగారు. ఆరడుగుల పొడవు, బలిష్ఠమైన శరీరం, నవాబు ఠీవి ఉట్టిపడే ముఖం, ఆ ముఖంలో అయస్కాంతంలాంటి ఏదో విచిత్రమైన ఆకర్షణ — వీటన్నిటితో ఎదటి వారిని ముగ్ధులను చేస్తున్నాడా ఆగంతుకుడు.

అందరితో చిరునవ్వుతో కరచాలనం చేస్తున్న అమీర్ ఒక్కసారిగా కళ్ళు మిరుమిట్లు గొల్పినట్లు ఆగిపోయాడు.

చకచక నడుస్తున్న 'రెమింగ్టన్' మిషన్ కూడా ఠక్కున ఆగిపోయింది.

''నమస్తే!'' చేతులు జోడించి ఎదురుగా నిలబడి ఉంది ఓ సుందరి.

''మీట్ మిస్ నళిని — టైపిస్ట్'' హెడ్డు పరిచయం చేస్తున్నాడు.

''నా . . . మ—స్తే!'' వచ్చీరాని తెలుగులో తడబడుతూ ప్రతినమస్కారం చేశాడు అమీర్.

''నా పేరు అమీర్. ఈ రోజే ఆఫీసులో చేరాను'' తనని తాను ఇంగ్లీషులో పరిచయం చేసుకున్నాడు.

''అలాగా! చాలా సంతోషం'' తియ్యని కంఠంతో ఇంగ్లీషులోనే అన్నది నళిని.

వెంటనే మరొకరిని పరిచయం చేయడానికి అటువైపుగా తీసుకు వెళ్ళాడు హెడ్డు.

అయిదు నిమిషాలయినాక తన సీట్లోకి వెళ్లి కూర్చున్నాడు అమీర్. ఆ రోజుకి పని ఏం లేదు. మరునాటి నుండి చెయ్యవచ్చునన్నాడు హెడ్డు.

అందుచేత తీరికగా ఆఫీసులో ఉన్న తన తోటివారినీ, ఫర్నిచరునీ, ఒక్కొక్క గుమాస్తా ఎదురుగా బల్లమీద కుప్పలుగా పడిఉన్న ఫైల్సునీ, హెడ్డు ముక్కుమీద ఒయ్యారంగా వాలి ఉన్న కళ్ళజోడునీ, ఎదురుగా బీటలువారిన గోడకు ఆనించి ఉన్న బూజుపట్టిన బీరువానూ, 'కొత్తగా వచ్చిన సాబ్ ఎలాటి వాడా?' అని దొంగచూపులతో ఆలోచిస్తున్న ప్యూనును — అందరినీ పరిశీలించసాగాడు. ఎందుకో ఆ వాతావరణానికి వ్యతిరేకంగా ఉన్నాడు అమీర్. అంతవరకు స్వేచ్ఛగా తిరిగిన విద్యార్థి తను. కాని ఈ రోజునుండి బాధ్యతాయుతుడైన ప్రభుత్వోద్యోగి. బాధ్యత అనగానే దాని వెంట బరువు కూడా ఉంటుందని అతని భయం. ఆ గదిలోని గాలి, వెలుతురు కూడా ఎంతో భయం భయంగా ఒదిగి ఒదిగి సంచరిస్తున్నట్లనిపించింది అతనికి. ఆ వాతావరణంతో అతనికి విముక్తి కలిగించింది నళినిమాత్రమే.

అంతటి అద్భుతమైన సౌందర్యవతిని తను పుట్టి పెరిగినాక హైదరాబాద్‌లో ఇంతవరకు చూడలేదనుకున్నాడు.

అందరికంటె కూడా సాధారణంగా ఏ స్త్రీలోనూ కనపడని ఒక అపూర్వమైన ఆకర్షణ ఉంది ఆమె ముఖంలో. ఎర్ర అంచుగల తెల్లని నేతచీర, ఎర్రని బ్లౌజూ, చెవులకు ఎర్రరాళ్ల దిద్దులు, ఎడమచేతికివాచీ, కుడిచేతికి రెండు బంగారు గాజుల మధ్య ఎర్రని మట్టిగాజులు, వదులుగా వేసుకున్న జడలో ఎర్రగులాబీ —వీటితో ఆమె ఎంతో మనోహరంగా కనపడుతూంది.

అతను హైస్కూలులో చదువుతున్నంత కాలం రెండో భాష తెలుగవటంవల్ల తెలుగు చదవటం, వ్రాయటం కొంచెం వచ్చు. హెచ్.ఎస్.సి. లో తను చదివిన శకుంతలోపాఖ్యానంలోని శకుంతల బహుశా నళిని అంత అందంగా ఉండి ఉండవచ్చు ననుకున్నాడు అమీర్.

'అయినా ఇంత అందమైన అమ్మాయి ఉద్యోగం చెయ్యటమేమిటి?' అనుకున్నాడు మళ్ళా.

ఆడపిల్లలు పెద్దచదువులు చదవడమన్నా, వాళ్ళు ఉద్యోగం చెయ్యడమన్నా అంత సదభిప్రాయం లేదు అమీర్‌కి.

ఏదో ఉమెన్స్ కాలేజీలో చదువుకున్నారంటె అర్థం ఉంది కాని ఇలా వయస్సు వచ్చిన ఆడపిల్ల మగవాళ్లతో కలిసి ఉద్యోగం చేస్తుందంటే అతనికి ఎబ్బెట్టుగా అనిపించింది.

అమీర్ మంచి సంప్రదాయంకల ముస్లిం కుటుంబంలో పుట్టాడు. అతనికి ఇద్దరు చెల్లెళ్ళున్నారు. ఒకామె బి.ఏ., రెండవ ఆమె పి.యు.సి. చదువుతున్నారు ఉమెన్సు కాలేజీలో. కాలేజికి వెళ్ళేటప్పుడు, వచ్చేప్పుడూ వాళ్ళు పరదాలోనే ఉంటారు. ఏదో అక్షరజ్ఞానం అబ్బుతుందని కాలేజీకి పంపుతున్నాడు కాని ఆ తరవాత వాళ్లచేత ఉద్యోగం చేయిద్దామన్న ఉద్దేశ్యం లేదు అమీర్ తండ్రికి.

అందంగా, నాజూగ్గా, ఇంగ్లీషు కవులు వర్ణించే లిల్లీ పుష్పంలా ఉన్న నళినివంక మరొక మారు చూశాడు అమీర్.

''మబ్బు విడిచిన చంద్రుడిలా పరదాలేని ఆమె ముఖం ఎంతో ఉజ్జ్వలంగా వెలిగిపోతూం దనుకున్నాడు అమీర్. ఈ హిందూ స్త్రీలు ఎంత స్వేచ్ఛగా పెరుగుతారు. తలవంచుకుని ఏకాగ్రతతో టైప్ చేస్తున్న ఆమె ముఖంలో కనబడుతున్న సభ్యతతో కూడిన స్వేచ్ఛ, హుందాతనం ముస్లిం కన్యలలో చాలా అరుదుగా తప్ప కనబడదు. నళిని అలా పర్దా వేసుకోకుండా నిర్లజ్జగా మగవాళ్లమధ్య కూర్చుంటే అతనిలో అసూయలాటి భావమేదో కలిగింది. కాని వెనువెంటనే ఆమె ముఖంలోని నైర్మల్యం, ఆత్మవిశ్వాసం చూస్తే, ఇష్టం కూడా కలిగింది. అలా ఆమెను **గురించి** ఆలోచిస్తూండగానే రెండు గంటలయింది.

లంచ్ టైమ్ అవడం వల్ల ఒక్కొక్కళ్లే సీట్లలో నుండి లేచి ఒళ్ళు విరుచుకుంటూన్నారు. హెడ్డు బయటికి వెళ్లిపోయాడు.

''అమీర్‌సాబ్! ఇవాళ మీరు కొత్తగా ఆఫీసులోకి ప్రవేశించినందుకుగాను మీ గౌరవార్థం ఓ చిన్న టీపార్టీ

చేస్తాం. కాంటీన్‌కి పోదాం రండి'' అన్నాడు రామారావు ఉర్దూలో.

ఆ సెక్షనులో నళిని, సుబ్బారావు తప్ప అంతా హైదరాబాదు వాళ్ళే కనుక ఉర్దూ వచ్చు. అమీర్‌కి తెలుగు అర్థం అవుతుంది కాని అంతగా మాట్లాడలేడు.

''అయితే ఇంతకూ డబ్బివ్వటం ఎవరి వంతు?'' అన్నాడు యు.డి.సి. జగన్నాథం.

''ఏమో. మిస్ నళిని నడగండి'' శర్మ చమత్కరించాడు.

''ఏమిటి నన్ను ఉర్దూలో తిట్టుకుంటున్నారు?'' పని ఆపి వేసి నవ్వుతూ అడిగింది నళిని.

''అబ్బె, ఎంతమాటండీ. మిస్ నళిని చాలా మంచి వారు అని అమీర్‌సాబ్‌కి పరిచయం చేస్తున్నాం'' అన్నాడు తెలుగులో రామనాథం.

''కొత్తగా వచ్చిన అమీర్‌సాబ్ గౌరవార్థం చేయబోతున్న టీపార్టీకి డబ్బులు మీరివ్వాలి అని తీర్మానించాం మేము'' రామారావు అసలు సంగతి బయటపెట్టాడు.

''మొన్ననేకదా మిస్టర్ జగన్నాథానికి ప్రమోషన్ వచ్చినప్పుడు నేనిచ్చాను. ఈసారి వంతు సుబ్బారావు గారిది.'' అన్నది నళిని.

''మీరంతా కలిసి నన్ను ఒంటరిగాణ్ణి చేస్తున్నారు'' అన్నాడు ఇంగ్లీషులో వాళ్ళ భాష సగంసగం అర్థం చేసుకొన్న అమీర్.

అంతా గొల్లున నవ్వారు.

''ఇకనుండి మనమంతా ఇంగ్లీషులోనే మాట్లాడు కుందాం తెలుగు, ఉర్దూ వదిలేసి. ఇటు అమీర్‌కీ, అటు సుబ్బారావు, నళినీలకు కూడా బాధ ఉండదు'' అన్నాడు శర్మ.

అందరు నవ్వుకుంటూ ఆఫీస్‌కాంటీన్ వైపు బయలు దేరారు.

రోజులు దొర్లిపోతున్నాయి.

అమీర్‌కి ఆఫీసు వాతావరణం బాగా పాతపడి పోయింది. అతనుసహచరులందరికీ సన్నిహితుడయినాడు. ముఖ్యంగా నళినికి చాలా దగ్గిరగా వచ్చాడతను. ఆమె అందరిలాగానే అమీర్‌తోకూడా ఎంతో చనువుగా మాట్లాడేది.

అతనెప్పుడూ ఆమెని ''మిస్ నలినీ!'' అని పిల్చేవాడు. అతనలా అనగానే సెలయేటిపరుగులా గలగల నవ్వేది నళిని.

''నలినీ కాదు నవాబ్‌సాబ్! న—ళి—ని'' అనేది హాస్యంగా.

చివరికి అతికష్టంమీద ఆమె పేరును సరిగా ఉచ్చరించటం నేర్చుకున్నాడు అమీర్.

అంతేకాక ఆమె ఎప్పుడూ అమీర్ ఇంగ్లీషు ఉచ్చారణని ఎగతాళి పట్టిస్తూండేది.

''చూడండి అమీర్‌సాబ్! ఆ 'ఖ' స్థానంమీద 'క' స్కేలు ఇలా ఇవ్వండి'' అనేది 'క' అన్న అక్షరాన్ని ఒత్తిపలుకుతూ.

తోటివారంతా నవ్వేవారామె చిలిపితనానికి.

నళినితో పరిచయమైనాక అమీర్‌లో చాలా మార్పులు వచ్చాయి. కరుడుగట్టిన అతని సనాతన ముస్లింహృదయంలో స్త్రీని గూర్చిన అభిప్రాయాల్లో కూడా ఎంతో మార్పు వచ్చింది.

ఒకప్పుడతను పర్దాను స్త్రీసౌశీల్యానికి, పతిధర్మానికి చిహ్నంగా భావించేవాడు. కాని ఇప్పుడు ఒక అందమైన

> స్త్రీ దైవస్వరూపిణి. ఆత్మకు సన్నిహితం అయినవాడు దూరం అవుతున్నకొలదీ ఆరాధన పెరుగుతుంది. ఆరాధనకు మతాలు అడ్డుగోడలు కాలేవు. హృదయంలో నిలుపుకున్న పవిత్ర స్త్రీ రూపాన్ని ఎప్పుడు చెరగకుండా ఉంచుకోగలగడం పురుషుని ఔన్నత్యానికి నిదర్శనం.

స్త్రీని పర్దావెనక బంధించనిదే రక్షణలేని సంఘం తనదని బాధపడుతున్నాడు. మనోహరమైన రూపంతో, మధురమంజులమైన పలుకులతో, స్వచ్ఛమైన హృదయంతో భాసిల్లే నళినితోటి సాహచర్యం అతనికొక దివ్యసుందర స్వప్నం.

కలకలనవ్వుతూ అందరితోను స్నేహపూర్వకంగా మాట్లాడే నళిని ఆ ఆఫీసుకొక జ్యోతిలాంటిది. అంతేకాదు 'సంవత్సరాల తరబడిగా తన హృదయంలో పేరుకుపోయిన మూఢనమ్మకాలనే తిమిరాన్ని పారదోలిన దివ్యజ్యోతి!' అనుకున్నాడు అమీర్.

ఒక రోజు నళిని అతనిని ''అమీర్ అంటే అర్థం ఏమిటి?'' అని అడిగింది.

''ధనవంతుడు'' అని సమాధానం ఇచ్చేడు నవ్వుతూ.

ఆమె నవ్వలేదు. ఏదో ఆలోచిస్తున్నట్లుగా అడిగింది.

''అజీజ్ అంటే?''

''దేవుడికిగల అనేకమయిన పేర్లలో అజీజ్ కూడా ఒకటి. దాని అసలు అర్థం ప్రియతముడు ఇంగ్లీషులో 'డార్లింగ్' అన్న పదంలా'' వివరించేడు అమీర్.

''థాంక్స్'' అని తన సీటులోకి వెళ్ళిపోయింది నళిని. చిత్రంగా చూశాడు అమీర్.

ఒక్కొక్కప్పుడు సెలయేరులా దుడుకుగా, తుళ్ళుతూ పరుగులిడే నళిని మరోసారి యమునానదిలా అంత గంభీరంగా ప్రశాంతంగా ఎలా మారిపోతుందా అనుకున్నాడు.

మరోరోజు సీరియస్‌గా టైపుచేస్తున్నదల్లా ఆపేసి ''అమీర్‌సాబ్!'' అని పిలిచింది గట్టిగా.

లంచ్‌టైము అవటం వల్ల ఎవరూ లేరక్కడ. కాంటీన్‌కి వెళ్లబోతూ ఫైల్సు సర్దుకుంటున్న అమీర్ ఆమె పిలుపు విని ఉలికిపడి చూశాడు.

''నిరీక్షణకు ఏమంటారు ఉర్దూలో?'' అని అడిగింది నళిని.

''ఇన్‌తజార్!'' నవ్వులో కొంటెతనం మిళాయించి అన్నాడు అమీర్.

కాని అది గమనించినట్లులేదు నళిని. ''ఎంత శ్రావ్యంగా ఉందీ పదం!'' అన్నది కల కంటున్నట్టుగా.

**శ్రీమతి**
**పరిమళా సోమేశ్వర్**

''అంతేకాదు. రొమాంటిక్‌గా కూడా ఉంది'' అన్నాడు అమీర్.

ఆమె చురుకుగా ఒకసారి అతనివంక చూసి తల తిప్పేసుకుంది.

ఆమె ముఖంలోని కాఠిన్యాన్నిచూసి జంకాడు అమీర్. వెంటనే తను తీసుకున్న అతి చనువుకు సిగ్గుపడ్డాడు కూడా. 'ఛీ! ఏమయిందీ రోజు తనకి? ఒక అందమైన స్త్రీ చనువుగా మాట్లాడినంత మాత్రాన దాన్ని ఆధారంగా తీసుకుని ఎంత వెకిలిగా ప్రవర్తించాను. తనని గురించి ఆమె ఏమనుకుంటుంది?'

అతని అంతరాత్మ గిలగిల తన్నుకొంది ఏదో పెద్ద నేరం చేసినట్లుగా.

తల వంచుకుని గబగబా కాంటీన్‌కి బయలుదేరాడు. దారిలోకూడా నళినిని గురించిన ఆలోచనలే. నళిని ఎందుకో ఎప్పుడు తనని ఉర్దూ పదాలకి అర్థం అడుగుతూంటుంది. అంతేకాదు ముస్లిం సాంప్రదాయాలన్నా వారి వేషభాషలన్నా ఎంతో ఆసక్తి కనపరుస్తుంది. ఎందుకో! కొత్తభాషన్నా, కొత్త మతమన్నా ఆమెకు గల జిజ్ఞాస దాని కారణం? లేదా అది వ్యక్తిగతంగా ఆమె తనమీద చూపే శ్రద్ధా?

కాంటీన్‌నుండి తిరిగివచ్చాక తన సీట్లో తల వంచుకుకూర్చున్నాడు అమీర్. నళినివంక చూడటానికి అతనికి భయం వేసింది. ఈపాటికి నళిని తనను గురించి ఎంత నీచంగా ఊహించుకుంటుందో అనుకున్నాడు.

చాలాసేపయినాక కుతూహలం చంపుకోలేక ఆమె వంక చూశాడు. ఆమె తన పనిలో గంభీరంగా నిమగ్నురాలయి ఉంది. అలవాటుప్రకారం ఆమె చేతి నాజూకు వేళ్లు రెమింగ్టన్ మీద చకచకా నడుస్తున్నాయి. ఆమె కళ్లు పక్కనే టేబులుమీద ఉన్న వ్రాత ప్రతి వైపు తీక్షణంగా చూస్తున్నాయి.

అలా తదేకంగా ఆమె వంక చూస్తున్న అతని హృదయంలో ఏదో కదలిక బయలుదేరింది. అప్పటి ఆమె మూర్తి అతని సన్నిహితమైన హృదయంలో ఒక రకమైన పూజ్యభావాన్ని ముద్రించింది.

''ఓ స్త్రీ! నీవు దైవ స్వరూపిణివి'' అనుకున్నాడు కళ్లు చెమరుస్తూండగా.

అలా ఆమెవంక చూస్తూంటే అతనికి హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది. రేపే రంజాన్! ఈ రోజు రాత్రి నమాజ్ చేయాలి. రంజాన్ దీక్ష పూనేముందు స్త్రీని గురించి అంతటి పవిత్రమైన భావం కలిగినందుకు కృతజ్ఞతాపూర్వకంగా అల్లాను స్మరించాడు అమీర్.

మరునాడు ఉదయం ఆఫీసుకు రాగానే అంతా మామూలుగానే పలకరించుకున్నారు.

తన సీట్లో కూర్చోబోతూ నళిని వైపుకు చూశాడు బెరుకుగా.

''ఆదాబర్జ్'' అన్నది హాడిగా.

''ఆదాబర్జ్''

ఆ రోజల్లా నళిని ఎవరితోనూ సరిగ్గా మాట్లాడలేదు ఎప్పటికిమల్లే. అమీర్ వంకయితే కన్నెత్తికూడా చూడలేదు. కుంగిపోయాడు సిగ్గుతో, అవమానంతో అమీర్.

ఆ రోజు ఉదయం నుండి అతను పచ్చి మంచి నీళ్లు కూడా ముట్టకుండా ఉపవాసం ఉండటం వల్ల సాయంత్రం అయ్యేసరికి నీరసం వచ్చింది. దానికితోడు నళిని ప్రవర్తన అతని హృదయాన్ని తీవ్రంగా గాయ

పరిచింది. ఆలోచనలతో అతని మెదడు వేడెక్కింది. కళ్ళు మండిపోతున్నాయి.

రంజాన్ మొదటిరోజు అంత వరకంగా తయారవడం జీవితంలో అదే మొదటిసారి అతనికి.

వారం రోజులు గడిచాయి. ఉపవాస దీక్షలో ఉన్న అమీర్ ఆఫీసులో చాలా ముభావంగా ఉంటున్నాడు. ప్రతి సంవత్సరం కూడా అలాటి సమయాన్ని అతను భగవచ్చింతనలో గడిపేవాడు. కాని ఈసారి అతనికి నళినితప్ప మరో ఆలోచన రావటం లేదు. ఆఫీసు పనిలో కూడా మనస్సును కేంద్రీకరించలేక పోతున్నాడు. ఏదో యాంత్రికంగా కాగితాలు తిరగవేస్తున్నాడంతే.

ఇప్పుడతను నళినిలోనే అల్లాను చూస్తున్నాడు. ఆమే అతని ఆరాధ్య దైవమయింది. తొలి చూపులోనే నళిని అతని మనస్సు నాకట్టుకుంది. ఇప్పుడామె తనతో మాట్లాడకపోయేసరికి ఆమె ఒక మానవాతీతమైన వ్యక్తిగా కనపడసాగింది అతని కంటికి. ఆమె అతనికి దూరమవుతున్న కొలదీ ఆమెఎడల గల ఆరాధన మరింత ఉన్నతం కాసాగింది.

అతనిలోని మార్పులను గమనిస్తున్న నళిని హృదయంలో ఆప్యాయత వంటి భావమేదో కలిగింది. ఆ రోజు లంచ్‌బ్రేక్ కాగానే కాంటీన్‌కి వెళ్లబోతూండగా నళిని అతన్ని పిలిచింది. "అమీర్‌సాబ్! రంజాన్ దీక్ష బాగా సాగుతూందా?" అని అడిగింది.

ఆమె పలకరింపుతో అతని కళ్ళలో వెయ్యి దీపాల వెలుగు వచ్చింది.

సంతోషంతో అతని కంఠం పూడుకుపోయింది. "అనవసరమైన ఆలోచనలతో మనసు పాడుచేసుకోకయీ నెల అంతా భగవద్ధ్యానంలో గడపండి. విష్‌యూ ఎ హాపీ అండ్ పీస్‌ఫుల్ రంజాన్" అంటూ వెళ్లిపోయింది.

అప్పటినుండి అతనితో మునుపటిలానే ఆప్యాయంగా మాట్లాడసాగింది నళిని. అమీర్‌మాత్రం తన సంభాషణలో ఎక్కడా ఆమెకు కోపం కలిగించే మాటలు దొర్లకుండా జాగ్రత్త పడుతున్నాడు.

ఒక ఆదివారం ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షనుస్టాఫంతా గోల్కొండ వెళదామని ప్రోగ్రాం వేశారు. తెల్లని దుస్తుల్లో నళిని ఎంతో అందంగా ఉంది. ఆ శిథిలాల్లో ఆమె తిరుగుతూంటే శాపవశాత్తూ మానవ ప్రపంచంలోకి వచ్చిన దేవకన్యలా కనపడింది అమీర్ కంటికి. రామదాసు జైలుదగ్గిర పూజారి హారతి వెలిగించటం, ఆశీర్వదిస్తూ శఠకోపరం నెత్తిమీద పెడుతూంటే వాళ్లంతా పళ్లెంలో పైసలు వేసి కుంకుమ నుదుట ధరించటం అన్నీ చిత్రంగా చూశాడు అమీర్. హిందూ దేవాలయాల్లోకి ప్రవేశించటం అతని కదే మొదటి సారి.

కోటఅంతా చూసిన తరవాత నవాబుల గోరీల వద్దకు తీసుకు వెళ్లాడు గైడ్. పక్కపక్కనే ఉన్న భాగమతీ కుతుబ్‌షాల గోరీలవద్ద కూర్చున్నారు అంతా. భాగమతీ కుతుబ్‌షాల మధుర ప్రణయాన్ని, వారి ఆదర్శ దాంపత్యాన్ని గైడ్ వర్ణించి చెబుతూంటే శ్రోతలు మంత్రముగ్ధుల్లా కూర్చుండి వింటున్నారు. హిందూ మహమ్మదీయుల ఐక్యానికి చిహ్నంగా నిలిచిన ఒక మహాసుందర నగర నిర్మాణానికి దారితీసిన ఆ అమర ప్రేమికుల గాథ వింటూంటే అమీర్‌లోని యువకరక్తం పొంగులు వారింది. నిష్కపటమైన అతని హృదయంలో ఆదర్శం, ప్రేమలాటి నినాదాలు బయలుదేరాయి. కుతుబ్‌షా భాగమతుల ప్రణయం— రెండు మధుర హృదయాల స్పందనం, రెండు ఆత్మల సంగమం, రెండు మహామతాల సామరస్యం.... వాటి ఫలితమే ఆంధ్రరాజధాని భాగ్యనగరం . . . అమీర్ రక్తం ఉద్వేగంతో పరుగులెత్తుతోంది.

"భాగమతి . . . నళిని . . ." హఠాత్తుగా నళిని వంక చూశాడు. ఆమె కళ్లనిండుగా నీళ్లు నింపుకుని తన్మయత్వంతో గైడ్ చెప్పేది అంతా శ్రద్ధగా వింటూంది. ఆశ్చర్యపోయాడు అమీర్.

'ఈ హిందూ మహమ్మదీయ ప్రణయగాథ ఈమెను కూడా అంతగా కదిలించివేసిందా?' అనుకున్నాడు.

గోల్కొండ ప్రయాణం తరవాత నెలరోజులు గడిచాయి. ఇంకా రెండు రోజులలో రాఖీ పండుగఉ[illegible]ది. బజార్లలో ఎక్కడ చూసినా చమ్కీదారులు కట్టిన రంగు రంగుల రాఖీలను షాపులముందు వేలాడవేసి అమ్ముతున్నారు. భాగ్యనగరమంతా ఈ రాఖీలతో కన్నుల పండువుగా ఉంది.

ఎక్కువగా ఉత్తర హిందూదేశపు ఆచారమైన ఈ రాఖీ పండుగ ఆంధ్రదేశంలో తెలంగాణా ప్రజమాత్రమే జరుపుకుంటారు. ముఖ్యంగా ఆంధ్ర రాజధాని అయిన భాగ్యనగరంలో ఈ పండుగ మరింత వేడుకగా జరుగుతుంది. దీనికి కారణం ఉత్తర హిందూదేశపు ప్రజలు చాలామంది ఇక్కడకు రావడంవల్ల వారి ప్రభావం నగర ప్రజలపై ఉండడంవల్లనేమో! ఈ పండుగను మహమ్మదీయులు జరుపుకోరు. అందుచేత దానిని గురించిన వివరాలు తెలుసుకోవాలనుకున్నాడు అమీర్ ఆఫీసుకు వెళుతూ దారిలో.

మధ్యాహ్నం లంచ్‌బ్రేక్ తరవాత హెడ్డు బయటికి ఎక్కడికో వెళ్లటంచూసి అందరు కబుర్లకోసం

## వీర జవానులు-3



## వింగ్ కమాండర్ డబ్ల్యూ. ఎమ్. గుడ్ మేన్

ఐకమత్యమే మహాబలం. ఐకమత్యం లేనిదే ఏ గొప్ప కార్యమైనా సవ్యంగా సాగదు. సాహస కార్యాలు సాధించాలంటే సహచరులందర్నీ కూడగట్టుకొని పని చెయ్యాలి. దేశంకోసమే ఈ జీవితం అనే ధ్యేయాన్ని సైనికులు పెంచుకుంటారు. తమ సుఖానికి కాకుండా కోట్లకొలది దేశవాసుల సుఖానికి అవసరమయే పనులు చెయ్యవలసిన బాధ్యత ఆ సైనికులదే. డబ్ల్యూ. ఎమ్. గుడ్‌మేన్ సైనికుడుగా తన బాధ్యతను చక్కగా నిర్వర్తించాడు.

జమ్మూ - కాశ్మీరు, పశ్చిమ పంజాబు క్షేత్రాలపై 24 గంటలూ గుడ్‌మేన్ మేఘంలాగ క్రమ్ముకొని వస్తున్న ప్రతి పాకిస్తాన్ విమానాన్ని పడగొట్టాడు. భారత భూమి మీద బాంబులు ప్రేల్చి వశపర్చుకోవాలనే దుర్బుద్ధితో వచ్చిన పాకిస్తానీయుల్ని అద్భుత పరాక్రమ రణకౌశలాలతో గుడ్‌మేన్ వెంట తరిమాడు. ఎన్నో విమానాలతో శత్రువులు ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. కాని, సునిశితంగా తన ప్రజ్ఞను ఉపయోగించి గుడ్‌మేన్ మిక్కిలి నేర్పుతో పాక్ సైనికుల నడుముల్ని విరగ్గొట్టాడు.

మిన్నువచ్చి మీదపడుతున్నా గుండె చెదరని ధైర్యం గల ధీరుడు అతను. భయంకర ప్రమాదకర పరిస్థితినిసైతం చిరునవ్వుతో ఎదుర్కొంటాడు గుడ్‌మేన్. అతను చేసిన వీరోచితకార్యాలు, మాతృభూమి రక్షణకై అతను చూపిన సాహసం వింటే ఒళ్లు జలదరిస్తుంది.

శత్రుసమూహంలో చొరబడి దానిని నాశనంచేసిన మేటిసాహసి గుడ్‌మేన్. దేశంకోసం మృత్యువునుసైతం లెక్కచెయ్యని గొప్ప దేశాభిమాని. మహావీరచక్ర బిరుదంతో మన ప్రభుత్వం గుడ్‌మేన్‌ని సన్మానించింది.

—కొలిపు వీరభద్రుడు

ఒకచోట చేరారు.

"మిస్ నళినీ!మీరు రాఖీ పండుగ జరుపుకుంటారా?" అని అడిగేడు అమీర్.

"మా గుంటూరు వైపు ఈ పండుగ ఎవరికీ తెలియదు. కాని ప్రస్తుతం ఇక్కడ ఉన్నాను కాబట్టే నేను కూడా జరుపుకోవాలనుకుంటున్నాను. పైగా ఈ పండుగలోని అంతరార్థం నాకు నచ్చింది" అన్నది నళిని.

"ఏమిటా అంతరార్థం?" అని అడిగేడు.

"ప్రతి యువకుడూ తన సోదరిచేతగాని, తను సోదరీభావంతోచూసే స్త్రీచేతగాని రాఖీ కట్టించుకుని ఆజన్మాంతరం ఆమె మానధర్మాలకు హామీగా నిలబడతానని దీక్షపూనటమే ఈ పండుగలోని ప్రత్యేకత" అన్నాడు రామనాథం.

"అసలు ఈ పండుగ ఎందుకు అమలులోకి వచ్చింది?"

"ఎందుకని అడిగితే ప్రత్యేకం కారణం చెప్పలేం. ప్రతిస్త్రీని సోదరీభావంతో చూడమంటుంది మా హిందూమతం" అన్నాడు శర్మ.

"ఏ మతమయినా పరస్త్రీని సోదరీభావంతో చూడమనే చెబుతుంది. నా దృష్టిలో ఈ పండగ వెనక మత విషయికమైన మరే కారణమయినా ఉండి ఉంటుంది" అన్నాడు అమీర్.

అప్పుడు నళిని అంది: "దీనికి మత విషయికమైన కారణం ఏం లేదు కాని చారిత్రాత్మకమైన కారణం ఉంది. మహమ్మదీయులు భారతదేశంపై దండెత్తి వచ్చినప్పుడు వారు రాజ్యాంగ కాంక్షకే కాక స్త్రీలాలసకు కూడా దాసులవటంవల్ల శీల రక్షణకోసం హిందూ స్త్రీలు ఎంతో శ్రమపడవలసి వచ్చింది. అలాటి దుస్థితిలో ప్రతి భారతీయుడు తన భార్యని, అక్క చెల్లెళ్లనేకాక ప్రతి హిందూ స్త్రీ మాన సంరక్షణ కోసం బాసటగా నిలుస్తానని దీక్షపూనాడు. అప్పటి నుండి అదే ఆచారాన్ని రాఖీబంధనమనే పేరుతో పండుగగా జరుపుకుంటూ వస్తున్నారు హిందూస్త్రీలు. మహమ్మదీయుల దండయాత్రలు ఉత్తర హిందూ దేశాన్నే ఎక్కువగా కదలించినందున అక్కడే ఈ ఆచారం ఎక్కువగా కనిపిస్తుంది" అన్నది నళిని.

ఆమె మాటలు వింటూనే అమీర్ ముఖం కొద్దిగా చిన్నబోయింది.

నళినితోసహా తక్కినవాళ్లంతా తమ ప్రమేయం లేకుండా ఏదో తప్పు జరిగిపోయినట్లు బాధపడ్డారు. అనవసరంగా ఆ ముస్లిం యువకుని మనస్సును గాయపరచానేమోనని నళిని బాధపడింది. కాని ఇదంతా ఒక్క క్షణం మాత్రమే. వెంటనే అమీర్ "థాంక్స్ మిస్ నళినీ. చాలా చక్కగా వివరించారు రాఖీని గురించి" అంటూ గట్టిగా నవ్వాడు. స్వచ్ఛమైన అతనినవ్వుతో అంతవరకు ఆ వాతావరణంలో ఉన్న సందిగ్ధత, సంశయం అనే చీకట్లన్నీ చెల్లాచెదరైపోయాయి.

రాఖీ పండుగనాడు ఉదయం పదకొండు గంటలయింది.

తలవంచుకుని శ్రద్ధగా వ్రాసుకుంటున్న అమీర్ గాజుల గలగల విని తలఎత్తి చూశాడు. ఎదురుగా నవ్వుతూ నిలబడింది నళిని.

ఆమె చేతిలో రాఖీ!

"అమీర్ భయ్యా! మీ కుడిచేతినిలా చాపండి. రాఖీ కడతాను" అంది చొరవగా అతని చేతికోసం తన చెయ్యి చాపుతూ.

అది కలో నిజమో తెలియని అయోమయంలో తన చేతినందించేడు అమీర్.

రాఖీ కడుతూ నెమ్మదిగా అంది నళిని,

"నేనీరోజు రిజైనిచ్చి వెళ్లిపోతున్నాను అమీర్" అని.

"అదేం?" అన్నాడు ఆశ్చర్యంగా.

కాసేపాగి సమాధానం ఇచ్చింది నళిని. "వచ్చే ఆది వారం నా వివాహం. నాకాబోయే భర్తకూడా ముస్లిం. పేరు అజీజ్."

"అలాగా! కంగ్రాట్యులేషన్స్" అన్నాడు అతి కష్టంమీద నవ్వుతూ.

రాఖీ కట్టటం అయినాక ఆమె అన్నది "మా తలిదండ్రుల అంగీకారంలేకుండా జరుగుతూంది పెళ్లి. శుభలేఖ లెవరికీ పంపటం లేదు. నువ్వువచ్చి తప్పక మమ్మల్ని ఆశీర్వదించాలి."

"అలాగే" కళ్లలో తిరుగుతున్న నీళ్లను ఆమెకు కనబడకుండా ఉండేందుకుగాను కళ్లు వాల్చేస్తూ అన్నాడు అమీర్.

"అమీర్‌భయ్యా, నా భర్తకూడా ముస్లిం అవటం వల్ల మొదటినుండి మీఆచార వ్యవహారాలను గురించి తెలుసుకునే ఉద్దేశ్యంతో మీకు సన్నిహితురాలినయ్యాను. అంతేకాక మనిద్దరికీ ఒకరకమైన రక్త సంబంధం ఉన్నట్లు భావించేదాన్ని. దానికితోడు మీ మంచితనం, నిష్కాపట్యం నన్నాకర్షించాయి. నిజంగా మీలాటి అన్న ఉండటం ఏ స్త్రీ కయినా గర్వకారణమే!" అన్నది ఆదరపూర్వకంగా.

అమీర్ ఎంత ప్రయత్నించినా కన్నీళ్లు ఆపలేక పోయాడు. రుమాలుతో కళ్లు తుడుచుకుంటూ "ఎప్పుడు ప్రయాణం?" అని అడిగాడు.

"ఈ రోజు సాయంత్రమే వెళుతున్నాను. నిన్ననే అజీజ్ దగ్గరనుండి లెటర్ వచ్చింది రమ్మనమని. ముందుగా చెబితే తోటివారంతా పార్టీ ఫొటోలు అంటూ గొడవ పెడతారని చెప్పలేదు. వాళ్లందరికీ సాయంత్రంలోగా చెబుతాను" అని ఇంతలో హెడ్డు రావటంవల్ల తన సీటులోకి వెళ్లిపోయింది నళిని.

ఒంటరిగా కూర్చున్న అమీర్ హృదయం ఉద్వేగంతో ఉవ్వెత్తుగా లేచి పడసాగింది.

అతని మెదడులో రకరకాల ఆలోచనలు వస్తున్నాయి. ఆ ఆలోచనలను తర్కబద్ధంగా పరిశీలిస్తున్నాడు అమీర్. నళిని తనకు రాఖీ కడితే ఎందుకిలా బాధపడుతున్నాడు తను? తనకు సంతోషం కలగటం లేదెందుచేత?

నళిని అంటే తనకెంతో ఇష్టం. కాని ఆ ఇష్టం ఎలాటిది? అన్నకి చెల్లెలిమీద ఉండే వాత్సల్యం లాటిదా? కాదు . . మరి . . ఏమిటి? అల్లా! తను . . . తను నళినిని ప్రేమించాడు! ప్రేమ! అసలు ప్రేమ అంటే ఏమిటి? స్త్రీ పురుషులిరువురి మధ్యగల కాంక్షతోకూడిన అనుబంధమే ప్రేమ అయితే తను నళినిని ఎన్నడూ ఆ దృష్టితో చూడలేదే? మరి అయితే తనలో ఎందుకీ వ్యథ? అంటే తన ఆలోచనలతో ప్రమేయం లేకుండా, తన హృదయాంతరాళంలో, తన మెదడులోని అడుగు పొరలలో నళినిపై ఆ భావం ఉదయించింది. అవును తను నళినిని ప్రేమించాడు. ఆమెను కోరేడు తను . . కాని ఆ సంగతిని గురించి ఆలోచించే సాహసం తనకు లేకపోయింది.

నళిని అందాన్నిచూసి ముగ్ధుడయ్యాడు తను.

ఆమె హృదయాన్ని ప్రేమించాడు. ఆమె వ్యక్తిత్వాన్ని ఆరాధించాడు.

కాని వీటన్నిటినీ సమగ్రంగా ఆలోచించి ఆ ఆలోచనల కొక రూపాన్ని ఇచ్చే ధైర్యం లేకపోయింది ఇంత కాలమూను. ఇప్పుడు ధైర్యం తెచ్చుకుందామన్నా ఆమె పరాధీన!

అయ్యో! ఎంత దురదృష్టవంతుడు తను! తన భావాలు పిరికివి. తన ప్రేమ మూగది. ఇప్పుడు కనీసం భగ్నహృదయంతో ఆమె నారాధించే అర్హతకూడా లేదు తనకు. ఈ రాఖీ బంధనంతో ఆ ఒక్క అవకాశాన్ని కూడా పోగొట్టుకున్నాడు తను. సోదరీభావంతో తప్ప మరోరకంగా ఆమెను గురించి ఆలోచించరాదు తను! అల్లా! ఈ విషమ పరిస్థితి నెదుర్కొనే నైతికబలాన్ని ప్రసాదించు ప్రభూ!

ఆ సాయంత్రం నళినికి వీడ్కోలునిస్తూ అప్పటి కప్పుడు ఓ చిన్న పార్టీ చేశారు. పార్టీలో కూర్చున్నంత సేపూ అమీర్ ఈ లోకంలో లేడు. లోకాతీతమైన ఆలోచనలలో మునిగిపోయిన యోగిలా కూర్చుండి పోయాడు అమీర్.

నళిని వెళ్లే ట్రైన్ సాయంత్రం ఎనిమిది గంటలకు. స్టేషనుకు వెళ్లాడు అమీర్.

పెరల్‌బక్ నవలలు రెండు, వారపత్రికలు, న్యూస్ పేపర్సు, పళ్లు — ఏమిటేమిటో కొని ఇచ్చాడు అమీర్. నళిని వెళ్లే సమయం దగ్గిర పడుతున్నకొలదీ అతనిలో సంచలనం బయలుదేరింది.

ఆమె వంక అంతకుముందెన్నడూ చూడనికోణంలో చూశాడు అమీర్.

ఎంత నిర్మలంగా, అమాయికంగా ఉందామెముఖం! ఆ కళ్లలో మెరుపులతో ఆ బుగ్గల్లో పసితనం . . . ఈ నళినికీ ఇంత క్రితం తనకు తెలిసిన నళినికీ ఎంత తేడా!

ఆమెను ఒక స్త్రీగా ఆరాధించాడు కాని ఇప్పుడు చెల్లెలుగా ప్రేమించాలి!

గార్డు విజిల్ వేశాడు. ట్రైన్ కదిలింది.

నళిని అమీర్ చేతిని తన చేతిలోకి తీసుకుని స్నేహపూర్వకంగా నిమిరింది. "పెళ్లికి తప్పక వస్తావుకదూ?" అన్నది.

అలాగే అన్నట్లు తల ఊపాడు అమీర్.

ట్రైన్ వేగం హెచ్చింది. నళిని చెయ్యి విడిచింది. వెనక్కి పరిగెత్తుతున్న ట్రెయిన్‌తోపాటు నళిని ముఖం కూడా దూరమవుతూంది.

ప్లాట్‌ఫారం మీద జనం అరుపులతో, రైలు కూతతో అతని చెవులు హోరుమంటున్నాయి.

నళిని వెళ్లిపోతూంది . . . అతనికి బాహ్యజ్ఞానం క్రమంగా నశించిపోతూంది.

దూరమవుతున్న నళిని . . . తన దివ్య సుందర స్వప్నం కరిగిపోతూంది— అమీర్‌కి గట్టిగా ఏడవాలని పించింది. కాని కంఠంనుండి శబ్దం బయటకురాలేదు!

రైలు వెళ్లిపోయింది. తన కల కరిగిపోయింది!

తనూ, జనం మిగిలారు ప్లాట్‌ఫారం మీద. కుడిచేతి వంక చూసుకున్నాడు అమీర్. ఆమె వదిలిన పవిత్ర చిహ్నం — రాఖీ! ★